క్లుప్తంగా

మద్యం దుకాణాల కోసం దరఖాస్తుకు నేడు ఆఖరితేదీ

గురజాల : మద్యం దుకాణాల కోసం దరఖాస్తుకు శుక్రవారం సాయంత్రం వరకు అవకాశం ఉందని ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు సూచించారు. ఆయన తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ఈనెల 14న నరస రావుపేటలోని ప్రకాశ్ నగర్‌లో లాటరీ తీస్తామని, మద్యం షాపును దక్కించుకున్నవారు ఈనెల 16న మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'మీకు తెలుసా'పై అవగాహన కార్యక్రమం

గురజాల : ప్రపంచ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకుని మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ సుధీర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం అనేది మన భావోద్వేగ మానసిక, సామాజిక శ్రేయస్సులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. మానసికంగా కుంగిపోకూడదని వివరించారు. ధైర్యంగా ఉంటే ఎంతటి కష్టాన్నైనా జయించవచ్చని పేర్కొన్నారు. జోనల్ సూపర్‌వైజర్ ఎం.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 100 గ్రామాల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సాయి కరుణ్ కుమార్, సురేష్, ఏడుకొండలు, జాఫ్రిన్, నర్స జయ, లింక్ వర్కర్లు పాల్గొన్నారు.

భారీ వర్షం



గురజాల : గురజాల పట్టణంలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి పట్టణ ప్రాంతం జలమయమైంది. సుమారుగా గంటకుపైగా ఏకధాటిగా పడిన వర్షానికి రోడ్లు నీటమునిగాయి. కారెంపూడి రోడ్డులో వర్షపునీరు నిలిచిపోయి ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీల్లో వర్షపునీటి పారుదల లేకపోవడంతో రోడ్లు, డ్రెయినేజీలు ఏకమయ్యాయి. మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు బాబాకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బంతీ..చామంతీ.. కనువిందు చేశాయిలే!





అద్దంకి – నార్కెట్‌పల్లి హైవే ఇరువైపులా ఉన్న పూలతోటలు ప్రయాణికులను ఆకర్షిస్తున్నాయి. హైవేను ఆనుకుని రైతులు పూలతోటలను సాగు చేస్తున్నారు. తోట ల్లో బంతి, కాగడ, చామంతి పూలు విరగ్గాశాయి. హైవేపై రాకపోకలు సాగించే ప్రయాణికులు కాసేపు ఆగి పూలు కొనుగోలు చేస్తూ, ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. – దాచేపల్లి

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కారెంపూడి: మహిళల చట్టాలపై అవగాహన సదస్సు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ పేరుతో సదస్సు నిర్వహించారు. ఆర్‌పీలు ఎస్‌బీ ఝూన్సీ గృహహింస, వరకట్న వేధింపులకు మహిళలు గురైనప్పుడు పొందాల్సిన న్యాయ సహాయం గురించి వివరించారు. న్యాయవాది షేక్ అమీర్ రెహమాన్ మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్‌లకు గురైనప్పుడు చట్టాన్ని ఆశ్రయించి పొందాల్సిన న్యాయ సహాయం గురించి వివరించారు. జాతీయ మహిళా కమిషన్ నుంచి రక్షణ పొందే విధానం గురించి వివరించారు. సదస్సుకు హాజరైన మహిళలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. గురజాల బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ మందపాటి శ్రీనివాసరెడ్డి, ప్యానెల్ లాయర్ కె.హరి సత్యనారాయణ, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు సదస్సులో మహిళల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టాలను గురించి వివరించారు. సదస్సుకు అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా సూపర్‌వైజర్లు, వెలుగు కో–ఆర్డినేటర్లు మహిళలు హాజరయ్యారు.



జ్యూట్ బ్యాగులందిస్తున్న అధికారులు, న్యాయవాదులు

చివరి భూములకూ నీళ్లందించేందుకే పూడికతీత

పిడుగురాళ్ల: ఆకురాజుపల్లి చివరి భూములకూ నీళ్లు అందించేందుకే పూడిక తీత పనులు చేపడుతున్నామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని అయ్యప్పనగర్ వద్ద ఉన్న ఆకురాజుపల్లి మేజర్ కాలువ వద్ద పూడిక తీత పనులను ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఆకురాజుపల్లి మేజర్ కాలువ కింద 21.276 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. దీని వలన 24,984 వేల ఎకరాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వై.శ్రీహరి, డీఈఈ మురళీధర్, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎంపీ లావు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గురజాల : ప్రజా సమస్యల పరిష్కార దిశగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. అంబాపురం వద్ద గల రామాపురం మేజర్ కాలువ, గురజాలలోని దైద మేజర్ కాలువ మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బుల్లయ్య, చాగంటి శ్రీనువాసరావు, శరమాళ్ల హనుమంతురావు, నజీమూన్, చింతకాయల దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పరాశక్తి యాజమాన్యం చేయూత

సత్రశాల(రెంటచింతల): సత్రశాల వద్ద వేంచేసిన అతిపురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాలకు స్థానిక పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆర్థికంగా చేయూతనిచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ గాదె రామిరెడ్డి గురువారం తెలిపారు. దేవస్థానంలో దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు పరాశక్తి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు రూ.లక్ష విరాళంగా అందచేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతి ప్రాచీన శైవక్షేత్రంగా పేరు పొందిన మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి, జెట్టిపాలెం, గోలి, పశర్లపాడు, మల్లవరం గ్రామాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు తమ ఫ్యాక్టరీ ఆవిర్భావం నుంచీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టెల మల్లికార్జున శర్మ, ఫ్యాక్టరీ అసిస్టెంట్ మేనేజర్ మల్లికార్జునరావు, కేసర వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఈఓకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న పరాశక్తి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు

పగిలిన కృష్ణానది నీటి పైప్‌లైన్

పిడుగురాళ్లకు రెండురోజులపాటు మంచినీరు బంద్

పిడుగురాళ్ల: కృష్ణా జలాలు వచ్చే వాటర్ పైపు పగలటంతో పిడుగురాళ్ల పట్టణానికి వచ్చే నీటి సరఫరా నిలిచిపోయింది. గోవిందాపురం కృష్ణానది నుంచి పిడుగురాళ్ల పట్టణానికి కృష్ణా నది నీళ్లు ప్రతిరోజు వాటర్ పైపుల ద్వారా వచ్చేవి. అయితే పట్టణంలోని చెరువు కట్ట సమీపంలో ఈ వాటర్ పైపు పగిలి పోవటంతో నీరు లీకేజీ అయింది. ఈ విషయాన్ని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. గురువారం మున్సిపల్ అధికారులు పగిలిన పైపులైన్‌కు మరమ్మతులను చేపట్టారు. అయితే పూర్తిగా పగిలిపోవటంతో ఈ పైపును మార్చి తిరిగి ట్రయల్ రన్ వేసి పట్టణ ప్రజలకు కృష్ణా జలాలు సరఫరా చేసేందుకు రెండు రోజుల సమయం పట్టనుంది. అందుకే రెండు రోజుల పాటు పట్టణ ప్రజలకు కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా అందవని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. అంతరాయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని ఆయన తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.





సత్రశాలలో దుర్గాదేవిగా భ్రమరాంబికాదేవి



రెంటచింతలలో దుర్గాదేవి అలంకారంలో..



మాచవరంలో వాసవీ మాతకు అలంకారం



దాచేపల్లిలో సరస్వతిదేవిగా అమ్మవారు



పిడుగురాళ్లలో కనక దుర్గగా దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి

కనకదుర్గా నమోస్తుతే

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. కొన్నిచోట్ల కనకదుర్గగా కరుణించారు. భక్తులు అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు.

– రెంటచింతల/కారెంపూడి/దాచేపల్లి/మాచవరం/పిడుగురాళ్ల/మాచర్ల రూరల్



పిడుగురాళ్ల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



రెంటచింతలలోని రామాలయంలో దుర్గాదేవి అలంకారం



పిడుగురాళ్లలో కనక దుర్గమ్మ అలంకరణలో వాసవీమాత



రెంటచింతల పాలువాయి జంక్షన్‌లో దుర్గాదేవిగా..



మాచర్ల మండలం కొత్తపల్లిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



కారెంపూడిలో వాసవీమాతకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దంపతులు

పౌరసరఫరాల గోదాములో జేసీ తనిఖీ



కందిపప్పు, పంచదార ప్యాకెట్లను పరిశీలిస్తున్న జేసీ గనోరే

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పౌరసరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్)ను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపంపిణీ కోసం నిల్వ ఉంచిన బియ్యం, కందిపప్పు, పామాయిల్ నిల్వలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు పరిశీలించి ఆన్‌లైన్‌లో సరిపోతున్నాయో లేదో తనిఖీ చేశారు. తూకం వేసే కాటాల పనితీరు, పంచదార, కందిపప్పు పాకెట్ల తూకం వేయించి అవి నిర్దేశించిన తూకంలో ఉన్నాయో లేదో పరిశీలించారు. చౌక ధరల దుకాణాలకు స్టాక్ చేరిందా లేదా అనేది వివరాలను పాయింట్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. గోదాములో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ పి.సుశీల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

పిడుగురాళ్ల: ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందు దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎరువులు, పురుగు మందుల దుకాణాల నుంచి రికార్డులను పరిశీలించారు. ఏఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ ధరలకు అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు అడిగి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఎరువులు, పురుగు మందుల దుకాణ యజమానులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలోని ఓ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి స్కేటింగ్‌కు ఎంపిక

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని చాణిక్య స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ శర్మ మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడా విభాగంలో రాష్ట్రస్థాయికి అకాడమీ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇటీవల మంగళగిరిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో ఎనిమిది మంది పాల్గొనగా నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తనీష్, మహమ్మద్, పవన్, వెంకట్‌రెడ్డిలను, వారి తల్లిదండ్రులను అకాడమీ తరపున అభినందించారు. అకాడమీ డైరెక్టర్ కంచర్ల నాగార్జున, ఎస్‌కే అబ్దుల్ బాషా, ఎం.శర్మ పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల బెడద



కారెంపూడి: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఖరీఫ్ వరిలో తెగుళ్ల బెడద ఎక్కువగా కన్పిస్తోంది. వరి ఆకు చివరలు ఎండి పోవడంతో ప్రారంభమై ఆ ఆకులు మొదలు వరకు ఎండిపోతున్నాయి. వరికి సాధారణంగా వచ్చే తెగుళ్లతో పాటు ఈ వైరస్ రైతులను ఎక్కువగా బాధిస్తోంది. దీని నివారణకు మందుల షాపుల వాళ్ల సూచించిన మందులను రైతులు పిచికారీ చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి యలమందారెడ్డి గురువారం వివరణ ఇస్తూ ఇది బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్ అని, దీని నివారణకు ఎకరాకు నెటీవా 100 గ్రాములతోపాటు స్ప్రెక్టోస్లైక్లిన్ కాని ప్లాంటా మైసిన్ కాని కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎక్కువగా నీరు కూడా నిల్వ ఉంచవద్దని చెప్పారు.

గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే ముఖ్యపాత్ర

మాచర్ల రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలకపాత్రని, నిధులను అవసరమైన వినియోగించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఆర్. ప్రవీణ్‌కుమార్ నాయక్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో ఆర్థిక సంఘ నిధులు సద్వినియోగం చేసుకోవడంలో వార్డు సభ్యులదే ముఖ్య పాత్రని అంటు రోగాల నివారణలో శానిటేషన్ మెరుగుపర్చటంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వార్డు ప్రతినిధులు అభివృద్ధి, సంక్షేమం అనే రెండు ప్రధాన అంశాలపై అవగాహన కలిగి అధికారులకు తగు సలహాలు, సూచనలు అందించి గ్రామాభివృద్ధిలో చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఇసుక ప్రియం.. బతుకు భారం

- ఇసుక లోటుతో నాలుగు నెలలుగా దొరకని పని
- పనులకోసం వేలాదిగా తరలివస్తున్న కూలీలు
- పనులకు పిలవక నిరాశతో ఇంటిముఖం పడుతున్న వైనం
- ఇసుక ధర పెరగడంతో పనులు ఆపేసిన యజమానులు



నరసరావుపేట మల్లమ్మ సెంటర్‌లో పనికోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని అధికారంలో ఉన్న కూటమి నేతలు దెబ్బతీశారు. సులభంగా దొరికే ఇసుకను ప్రియం చేసి దొరక్కుండా చేశారు. దీంతో వేలాది మంది కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇసుక ఫ్రీ పేరుతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఇసుక భవన నిర్మాణదారులకు టన్ను రూ.1600 నుంచి రూ.2వేలకు లభిస్తుంది. దీంతో ఆ యజమానులు నిర్మాణాలను నిలిపి వేయటం, వాయిదా వేయటం చేయటంలో ఆ విభాగంపై ఆధారపడ్డ కార్మికులకు పని దొరకటం కష్టంగా మారింది. ప్రస్తుతం 20 టన్నుల లారీ రూ.30వేలకు పైగా పెట్టాల్సివస్తుందని భవన నిర్మాణ దారులు వాపోతున్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల పదుల సంఖ్యలో అపార్టుమెంట్లు, ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మాణంలో ఉన్నాయి. వాటిలో పనికోసం ప్రతిరోజూ నరసరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటు చుట్టుపక్కల ఉన్న చిలకలూరిపేట, సత్తెనపల్లి నియోజకవర్గాలని పలు గ్రామాల నుంచి నరసరావుపేటలోని మల్లమ్మసెంటర్‌కు చేరుతుంటారు. యజమానులు, మేస్త్రీలు ఈ సెంటర్‌కు వచ్చి తమకు కావాల్సిన కూలీలను తీసుకెళుతుంటారు. ప్రస్తుతం కేవలం పదిశాతం మందికే పని దొరుకుతుందని కార్మికులు చెబుతున్నారు. ప్రభుత్వాధికారులు ఇసుకకు ఢోకాలేదని, కావాల్సినంత ఇసుక లభిస్తుందని ప్రకటించారు. అయితే కూలీలకు మాత్రం పని దొరకటం లేదు.



ప్రకాష్‌నగర్‌లో ఓ నిర్మాణంలో ఉన్న ఇంటివద్ద టన్ను రూ.1600కు తోలిన ఇసుక

ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి పనిలేదు



ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సక్రమంగా పని దొరకటంలేదు. నెలకు ఐదారురోజుల మించి దొరకలేదు. నెలరోజుల నుంచి అసలు పనికి పిలిచే వారే లేరు. నిత్యావసరాలు పెరిగిపోయాయి. రూ.90 ఉన్న పామాయిల్ రూ.120 అయింది.

–ఎస్.బ్రహ్మం, బేల్దారీ మేస్త్రి, 33వ వార్డు, నరసరావుపేట

పనులన్నీ ఆగిపోయాయి



నాకు నిర్మాణ రంగంలో 42ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం బేలుదారి మేస్త్రిగా పనిచేస్తున్నా. యూనియన్ కార్యవర్గంలో కూడా పనిచేశా. ప్రస్తుతం ఖాళీగా ఉన్నా. ఇసుక దొరక్క ఇళ్ల యజమానులు అందరూ పనులు ఆపేశారు. మాకు కూడా పనిలేకుండా పోయింది. పిలిచే వారే కరువయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– పి.వెంకటేశ్వర్లు, బేల్దారి మేస్త్రి, వెంగళరెడ్డి నగర్, నరసరావుపేట

టన్ను రూ.2వేలు పెట్టి కొనుక్కెళుతున్నా..



గత ఆర్నెళ్ల నుంచి ఇంటి నిర్మాణం చేపట్టా. బండ పరుపుకోసం ఇసుక కావాల్సివచ్చింది. ఇసుక దొరక్క మూడువారాలుగా పని ఆపేశా. ఇప్పుడు మారు బేరగాడి వద్ద టన్ను రూ.2వేలకు కొనుక్కొని తీసుకెళుతున్నా. గతంలో ఎన్నడూ ఇసుక ధరలేదు. ఇసుక ఫ్రీ అని చెబుతూ అత్యంత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

– హనుమంతరావు, ఇంటియజమాని, బరంపేట